



పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని అనుమతులను నిబంధనల మేరకు సకాలంలో మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని శంకరన్‌హాలులో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తుల పురోగతి, పిఎంఈజిపి రుణాల మంజూరు, క్లస్టర్ డెవలప్‌మెంటు ప్రోగ్రాం మొదలైన అంశాలను జిల్లా పరిశ్రమలశాఖ జిఎం ప్రసాద్ వివరించారు.కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటవుతున్న పరిశ్రమలకు సంబంధించి అన్ని అనుమతులను ఆయా శాఖల అధికారులు సత్వరమే మంజూరు చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఎపిఐఐసి జెడ్ఎం శేఖర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, ఎల్‌డిఎం శ్రీకాంత్ ప్రదీప్, ఇరిగేషన్ ఎస్ఈ దేశ్‌నాయక్, డిటిసి చందర్, ఎపిఎంఐపిడి శ్రీనివాసులు, ఆర్డీవో అనూష, పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఓ ఆనంద్

కావలి భూ కథ కంచికేనా..!

- రెవెన్యూ, మున్సిపల్ అధికారులు మౌనం
- ప్రభుత్వ120 ఎకరాలు ఏమయ్యాయి..
- టిడిపి, వైసిపి నేతలు కుమ్మక్కు

కావలి మున్సిపాలిటీ పరిధిలో గత ప్రభుత్వంలో వైసిపి నేతలు 120 ఎకరాలు ప్రభుత్వ భూమిని ఆక్రమించి రియల్ ఎస్టేట్ చేశారని హడావుడి చేసిన రెవెన్యూ, మున్సిపల్ అధికారులు మౌనం వహించారు. ప్రభుత్వ భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన వైసిపి నేతల అంతుచూస్తామని హెచ్చరించిన టిడిపి నేతలు పత్తా లేకుండా పోయారు.. కావలిలో ఏం జరిగింది.? భూ ఆక్రమణలో అధికారులు బయటపెట్టిన రికార్డుల పరిస్థితి ఏమిటి.. అంతా అనుమానంగానే కనిపిస్తోంది. రెవెన్యూ అధికారులు వెళ్లిపోయినా.. మున్సిపల్ అధికారులు ఈ వ్యవహారంలో ముందుకెళ్లడం లేదు. భూ కుంభకోణంలో అధికార టిడిపి, ప్రతిపక్ష వైసిపి నేతలు కుమ్మక్కయ్యారనే విమర్శలు వస్తున్నాయి. ఇందులో వాస్తవాలు ఏమిటో తెలియాలంటే సమగ్ర విచారణ జరగాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కావలిలో అసలు ఏం జరిగిందో తేల్చాల్సిన అవసరముంది.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

అధికారం ఉంటే ఒక లెక్క...లేకుంటే మరోలెక్క...కావలి పట్టణంలో అది జరిగింది.. 2019 నుంచి 2024 వరకు వైసిపి అధికారంలో ఉన్న సమయంలో ఇక్కడ పనిచేసిన ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సబ్ రిజిస్ట్రార్లు, సుడా అధికారులు తమ విధులను మరిచిపోయి అప్పటి ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆపార్టీనేతల మన్ననల కోసం వారు చెప్పినట్లే చేశారనే విమర్శలున్నాయి. ఉన్నతాధికారులు లెక్క చేయకుండా అధికార పార్టీనేతల సేవలో తరించారనే ఆరోపణలున్నాయి. ఎన్ని అక్రమాలు జరిగినా పార్టీ అధికారంలో ఉండడంతో అంతా సవ్యంగా సాగిపోయింది. కావలి పట్టణంతోపాటు చట్టుపక్కల గ్రామాల మున్సిపాలిటీ పరిధిలో సుమారు 120 ఎకరాలు ప్రభుత్వ భూమిని దురాక్రమణ చేసి, తమ వెంచర్లలో కలిపేసి, రియల్ ఎస్టేట్ చేశారని ప్రభుత్వం మారిన తరువాత రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు తెలిసింది. అప్పటి వరకు అధికారులు వైసిపి మైకంలో ఉన్నట్లు తెలిసింది. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత సెప్టెంబర్ 15 వతేదీ అప్పటి కావలి మున్సిపల్ కమిషనర్, తహశీల్దారులు శ్రావణకుమార్‌లు ఆధారాలతో బయటపెట్టారు. ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటామని ప్రకటించారు. జెసిబిలు పెట్టి హల్ చల్ చేశారు. ఇరిగేషన్ కాలువలు, గుంటలు, పూడ్చి వేసి, అక్కడ ఇంటి పాట్లు ఏర్పాటు చేశారని స్వయంగా అధికారులే రికార్డులతో సహా బయటపెట్టారు. కావలి మున్సిపాలిటీ పరిధిలో 120 ఎకరాలు ప్రభుత్వ భూమి ఆక్రమించి



కావలిలో వైసిపి నేతలు ఆక్రమించిన ప్రభుత్వ భూమి

రియల్ ఎస్టేట్ చేశారని అధికారులే మీడియా సమావేశం ఏర్పాటు చేసి ప్రకటించారు. అందులో . 70 ఎకరాలు ప్రభుత్వ గుంటలు, వంట కాలువలున్నాయి. మరో 50 ఎకరాలు వివిధ రకాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు విచారణలో తేలింది. సర్వేనెంబర్ 1855 కాటా శ్రీనివాసులురెడ్డి, ఇదే పేరుతో అనేక సర్వేనెంబర్ల కింద భూమి ఆక్రమించినట్లు, . సర్వేనెంబర్ 1282లో కస్తూరి గుంటలో మాజీ ఎంఎల్‌ఎ ప్రతాప్‌కుమార్‌రెడ్డి భావమర్దుల పేరుతో ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. పక్కింలగుంట పోరంబోకు స్థలంలో మన్నెమాల సుకుమార్‌రెడ్డి ఆధీనంలో 1-60 ఎకరాలు ఉన్నట్లు తెలిసింది. కాటా శ్రీనివాసులురెడ్డి, జనిగర్ల మహేంద్ర, జంపని మాధవరావు, సమాది కృష్ణ, శంకర్‌బాబులురెడ్డి, తదితర పేరుతో 120 ఎకరాలు ఆక్రమణలో ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు ప్రకటించారు. నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఈ విషయంలో ఒక్క అడుగు ముందుకు పడినట్లు కనిపించడం లేదు.

టిడిపి, వైసిపి నేతలు కుమ్మక్కయ్యారా..?

కావలిలో వైసిపి నేతలు రూ.600కోట్లు భూ కుంభకోణం చేశారని ప్రచారం చేసిన ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డి ఇపుడు మౌనంగా ఉన్నారు. ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలు పూర్తవుతున్నప్పటికీ భూ వ్యవహారం కొలిక్కి రావడం లేదు. ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన వైసిపి నేతతో టిడిపి నేతలు సఖ్యతగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ భూమి 120 ఎకరాలు ఆక్రమణకు గురైందని ప్రకటించిన అధికారులు నోరు మెదపడం లేదు. ఈ వ్యవహారం పెద్ద ఎత్తున చేతులు మారినట్లు ప్రచారం సాగుతోంది. వైసిపి ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన కొందరు వ్యక్తులు టిడిపి కండువా కప్పుకొనేందుకు సిద్ధమవుతున్నారనే ప్రచారం సాగుతోంది. ఈ నేపధ్యంలో భూ కుంభకోణం ఫైల్ బుట్టదాఖలైందని సమాచారం. నిన్న మొన్నటి వరకు దూకుడుగా వ్యవహరించిన ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డి ఇపుడు ఎందుకు స్పీడ్ తగ్గించారో అంతుపట్టడం లేదు. ఈ పరిస్థితుల్లో అక్కడ భూములు కొనుగోలు చేసిన ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. నేతలు రాజకీయ క్రీడల్లో సామాన్యులకు ఏం జరుగుతుందోననే ఆందోళన అందరిలో కనిపిస్తోంది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని కావలి భూ కుంభకోణం వ్యవహారం తేల్చాల్సి ఉంది.

కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ ఏర్పాటు చేయాల్సిందే..

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లా సమగ్రాభివృద్ధిని ఆకాంక్షిస్తూ కృష్ణపట్నం పోర్టు నిర్మాణం జరిగిందని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు దోహదపడుతున్న కంటైనర్ టర్మినల్‌ను మరో ప్రాంతానికి తరలించడం దారుణమని, ప్రభుత్వాలు ఈ సమస్యపై స్పందించి కంటైనర్ టెర్మినల్‌ను తిరిగి పోర్టులో ఏర్పాటు చేయాలని వామపక్షపార్టీలు, కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు గురువారం నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం మినీ హాల్‌లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వాపక్షపార్టీలు, కార్మిక సంఘాలు తీర్మానం చేశాయి. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొని ప్రసంగించారు. జిల్లా అభివద్ధికి దోహదపడుతున్న కంటైనర్ టెర్మినల్ ను మూసి వేయడం తగదని, ప్రభుత్వంలోని పెద్దలు ప్రజాప్రతినిధులు కంటైనర్ టెర్మినల్ కాపాడుకునే దాంట్లో పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని వక్తలు దుయ్యబట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ , సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ జిల్లాలో కష్ణపట్నం పోర్టు ఒక ప్రధానమైన ఉద్యోగ కల్పనా కేంద్రం అని, అందులో కంటైనర్ టెర్మినల్ వేలాది మందికి ఉద్యోగాలు కల్పించిన దన్నారు. దానిని మూసేసినందున 10,000 మంది వీధిన పడ్డారన్నారు. జిల్లా వాసులు అదానీ కష్ణపట్నం పోర్టు మూలాన భవిష్యత్తులో కాలుష్యం లో జీవనం సాగించాల్సి వస్తుందని అన్నారు. తమిళనాడు ప్రజలు కాలుష్యానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తే, ఆ బొగ్గును మొత్తం కష్ణపట్నం పోర్టుకు తరలిస్తున్నారన్నారు. అన్ని సంఘాలను ఒకే వేదిక మీదకు తెచ్చి పోరాటం సాగిస్తామన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు కే రాంబాబు, ఆర్. ఎస్. పి. నాయకులు రవికాంత్ ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు పాశం నరసింహారావు మాట్లాడారు. అదాని కేంద్ర ప్రభుత్వంలోని మోడీ అండ చూసుకొని జిల్లా ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నాడని, ప్రజలంతా ఐక్యమయ్యి టెర్మినల్ ని సాధించుకోవాలన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

40 మందితో కంటైనర్ టెర్మినల్ సాధన పోరాట కమిటీ

కంటైనర్ టెర్మినల్ సాధన పోరాట కమిటీని 40 మందితో ఏర్పాటు చేశారు. కమిటీ కన్వీనర్‌గా ఎం మోహన్ రావు , కో కన్వీనర్‌గా దామా అంకయ్యలను ఎన్నుకొన్నారు. సిపిఐ ఎం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు వి. రామరాజు ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ కిషోర్, రైతు సంఘం నాయకులు మూలివెంగయ్య , వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు జే వెంకమ రాజు, ఎం పుల్లయ్య సిఐటియు నాయకులు ఎస్‌కె రెహానా బేగం, కే పెంచల నరసయ్య ,డి అన్న పూర్ణమ్మ ,కే సురేష్ ,ఎం రాజా, సిపిఎం నాయకులు కత్తి శ్రీనివాసులు, పి సూర్య నారాయణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం వి రమణ పి.ఎన్.యం జిల్లా కార్యదర్శి గండవరం శేషయ్య రఘు రామయ్య,లీలామోహన్ కష్ణపట్నం పోర్టు కార్మిక నాయకులు గోగుల శ్రీనివాసులు, గడ్డం అంకయ్య, రామారావు, అజయ్‌కుమార్, బాలకోటయ్య పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

నెల్లూరు :నగర పాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలాల్లో పార్కులను అభివద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. గురువారం పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 27 వ డివిజన్ రిత్విక్ ఎన్ క్లేవ్ ప్రాంతంలోని పార్కును కమిషనర్ పరిశీలించారు.కమిషనర్ మాట్లాడుతూ స్థానిక పార్కుకు సమీపంలో ఉన్న నగర పాలక సంస్థ ఖాళీ స్థలాలను గుర్తించి, వాటిని అభివద్ధి చేసి ప్రజలకు ఉపయోగపడేలా అందుబాటులో తేవాలని సూచించారు.

జగన్మోహన్‌రెడ్డి అజ్ఞాని : కాంగ్రెస్

ప్రజాశక్తి-నెల్లూరు : తల్లిని, చెల్లిని బ్లాక్ మెయిల్ చేసి వైఎస్ జగన్ మూర్ఖుడు అని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. స్థానిక జర్నలిస్ట్ భవన్ ప్రెస్ క్లబ్లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్తి కోసం తల్లి, చెల్లినే బ్లాక్ మెయిల్ చేస్తున్న జగన్మోహన్ రెడ్డి క్షమించరాని తప్పు చేశాడన్నారు. ఆయన ఓ అజ్ఞాని అన్నారు.

పంటల యాజమాన్య పద్ధతులపై శిక్షణ

ప్రజాశక్తి - కందుకూరు :కందుకూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లోలోని వ్యవసాయ ఉద్యానవన సహాయకుల శిక్షణ కార్యక్రమం సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ పి అనసూయ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. కషి విజ్ఞాన కేంద్రం కందుకూరు సీనియర్ శాస్త్రవేత్త , హెడ్ డాక్టర్ జి. ప్రసాద్ బాబు, నెల్లూరు జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఎడిఎ, లక్ష్మి మాదవి, కందుకూరు వ్యవసాయ శాఖ ఎడిఎ అనసూయ, ఐదు మండలాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు. కందుకూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లోని రైతు సేవా కేంద్రాల గ్రామ వ్యవసాయ సహాయకులకు మిరప, పొగాకు, వరి, మినుము, శనగ పంటలలో ఉత్తమ యాజమాన్య పద్ధతులు, ప్రకతి వ్యవసాయంపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. కెవికె హెడ్ డాక్టర్ జి.ప్రసాద్ బాబు మాట్లాడుతూ ప్రస్తుతం మిరపలో నారు నాటడం జరుగుతుందన్నారు. జిల్లా డి.ఆర్.సి. ఏ.డి.ఏ. లక్ష్మి మాధవి మాట్లాడారు. శాస్త్రవేత్తలు డా. జ్యోతి, వివేక్, డా.శ్రీరంగ, మండల వ్యవసాయ అధికారులు రాము కుమార్, హేమంత్, రవి కుమార్, గీతా కుమారి, ప్రకతి వ్యవసాయ మాస్టర్ శిక్షకురాలు సునీత, ధనమ్మ, రాజు పాల్గొన్నారు.

మున్సిపల్ కళాశాలలో పరిశీలన

ప్రజాశక్తి-నెల్లూరు :నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న వి.ఆర్ మున్సిపల్ జూనియర్ కళాశాలను మేయర్ స్రవంతిజయవర్ధన్ సందర్శించారు. గురువారం విఆర్ కళాశాలను సందర్శించిన ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ కళాశాల సౌకర్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధ్యాపకులు, కళాశాల సిబ్బందితో మాట్లాడుతూ కళాశాల నిర్వహణ, సౌకర్యాలపై ఆరాతీశారు. కళాశాల సిబంది, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశు గణన

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లాలో నేటి నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు పశు గణన జరుగుతుందని కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో పశుసంవర్ధక శాఖ రూపొందించిన వాల్ పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు.కలెక్టర్ మాట్లాడుతూ పశు గణన సిబ్బంది జిల్లాలోని ప్రతి గడపకు వచ్చి విషయసేకరణ గావిస్తారనీ, ఇంటికి వచ్చే విషయసేకరణాధికారులకు ప్రజలు పశువుల సమగ్ర సమాచారం అందించాలని కోరారు. పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరక్టర్ కె. రమేష్ నాయక్ మాట్లాడారు. పశు సంవర్ధక శాఖ అధికారులు టి.సోమయ్య, ఎం.నాగమణి, రామచంద్రారెడ్డి,మంజునాథ్ సింగ్ పాల్గొన్నారు.

బాపిరెడ్డికి ఘన నివాళి

ప్రజాశక్తి-గుడ్లూరు :జెడ్‌పిటిసి కొరిశపాటి బాపిరెడ్డి సేవలు ఎవరు మరువ లేవమని వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి ,మాజీ మంత్రి కందుకూరు మాజీ ఎమ్మెల్యే మానుగుంట మహిధర్ రెడ్డి,కందుకూరు నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ కొనియాడారు. జడ్పిటిసి బాపిరెడ్డి కావలి లో నివాసం ఉంటూ ఆకస్మికంగా మరణించడం తో గుడ్లూరు మండలం గొల్లపాలెంలో గురువారం సంస్మరణ సభ జరిగింది. బాపిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించారు..

29 నుంచి స్ట్రోక్ ప్యాకేజీ

ప్రజాశక్తి-నెల్లూరు :నారాయణ హాస్పిటల్ లో వరల్డ్ స్ట్రోక్ డే ని పురస్కరించుకోని ఈ నెల 29 వ తేది నుంచి నవంబరు 28 వరకు స్ట్రోక్ ప్యాకేజి అమలు చేస్తున్నట్లు మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి పేర్కొన్నారు. గురువారం నారాయణ వైద్యశాలలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ గతంలో 50 ఏళ్ళ పైబడిన వారు ఎక్కువ శాతం స్ట్రోక్ భారిన పడేవారన్నారు. ప్రస్తుతం వయస్సుతో సంబంధం లేకుండా స్ట్రోక్ భారిన పడుతున్నారన్నారు. అందరూ ఆరోగ్యంగా అనందంగా ఉండాలనే ఆలోచనతో వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా నారాయణ మెడికల్ కాలేజి హాస్పిటల్ కాంప్రహెన్సివ్ స్ట్రోక్ ప్యాకేజీని ప్రారంభిస్తున్నామన్నారు. నారాయణ హాస్పిటల్ న్యూరాలజి విభాగాధిపతి డాక్టరు ఎన్.ఎన్ సంపత్ కుమార్ మాట్లాడుతూ గుండె పోటు లాగా బ్రెయిన్ స్ట్రోక్ ఒక అత్యవసర వైద్యస్థితి అన్నారు. నారాయణ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టరు బి. హరిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక హెల్ప్ డెస్క్ ద్వారా 9640100555 నంబరుకు ఫోన్ ద్వారా సంప్రదించి అపాయింట్మెంట్ తీసుకోవచ్చున్నారు. నారాయణ హాస్పిటల్ డిప్యూటి మెడికల్ సూపరింటెండెంట్ డావ అరుణ్కాంత్, న్యూరాలజిస్ట్ డావ అనూష, హాస్పిటల్ ఏజీఎం ఎ.సి శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు

వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి-నెల్లూరు :స్థానిక వేదాయపాళెం పోలీసు స్టేషన్ పరిధిలో ముక్తియార్ ఆలియాస్ మోటు అనే 45 ఏళ్ల వ్యక్తిని కత్తితో దాడి చేసి దారుణంగా హత్య చేశారు. గురువారం సాయంత్రం అయ్యప్ప గుడి సెంటర్ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అయ్యప్ప గుడి సెంటర్ సమీపంలో ఉన్న ఓ ఆటో గ్యారేజీలో ముక్తియార్ పనిచేస్తుండే వాడు.గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడి చేసి ఘటన స్థలం వద్ద నుంచి పారిపోయినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలిసిన వెంటనే వేదాయపాళెం పోలీసు స్టేషన్ అధికారులు హుటాహుటిన ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు ప్రారంభించారు.

పోర్టు కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి - తోటపల్లిగూడూరు :ఆదాని కృష్ణపట్నం పోర్టు ఉద్యోగులు, కార్మికుల, ఆరోగ్య పరిరక్షణకు అదాని కష్ణపట్నం పోర్టు ప్రత్యేకంగా కషి చేస్తుందని అదాని కష్ణపట్నం పోర్టు సిఇఒ జగదీష్ ప టేల్ పేర్కొన్నారు. గురువారం అదాని కష్ణపట్నం పోర్ట్ లాజిస్టిక్స్ వర్కుషాప్ లో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఈఓ జగదీష్ పటేల్ మాట్లాడుతూ పోర్ట్ ఉద్యోగులు, కార్మికులు, ఆరోగ్య పరి రక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. సిఓఓ రాజన్ బాబు, అడ్మిన్ హెడ్ గణేష్ శర్మ, మనీ ష్ దేవ్ ,లాజిస్టిక్ హెడ్ శ్రీధర్ ,వేణుగోపాల్ రెడ్డి, వివేక్ నా రాయణ, మధుసూదన్, వేణు, మనోహర్ బాబు, వివిధ విభాగాలు హెచ్ఒడిలు పాల్గొన్నారు.

భూమి హద్దుల మార్పుపై ఫిర్యాదు

తోటపల్లిగూడూరు :పొలం హద్దులు మార్చి విక్రయించి మోసం చేసినట్లు గురువారం పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాల మేరకు కోడూరుకు చెందిన పెమ్మారెడ్డి శ్రీనివాసులు రెడ్డి నెలిమిట్టకండ్రి గ ప్రాంతానికి చెందిన తమ్మిరెడ్డి జనార్ధన్ కు కోడూరు కండ్రిగ ప్రాంతం సర్వే నంబర్ 18/7లో 0.52 ఎకరాల భూమిని విక్ర యించారు. శ్రీనివాసుల రెడ్డి మరో రైతుకు చెందిన పొలం సర్వే నంబర్ వేసి విక్రయించి మోసం చేసినట్లు తెలుసుకొన్న జనార్ధన్ పోలీ సులను ఆశ్రయించారు.

విజ్ఞాన ప్రదర్శన విజేతలు వీరే..

తోటపల్లిగూడూరు :మండలంలోని కోడూరు అంబేద్కర్ గురుకులంలో గురువారం జరిగిన జిల్లాస్థాయి అంబేద్కర్ గురుకుల పాఠశాలల విజ్ఞాన ప్రదర్శనలో సీనియర్స్ విభాగంలో 8 మందిని, జూనియర్ విభాగంలో 8 మంది విద్యార్థులను జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.నెల్లూరు జిల్లా ఉప విద్యాశాఖ అధికారి ప్రసన్న లక్ష్మి, జిల్లా గురుకుల పాఠశాలల కో ఆర్డి నేటర్ జయలక్ష్మి, సమగ్ర ఏ ఎం ఓ సుధీర్ బాబు, ఎంఈఓ వేణుగోపా ల్ రెడ్డి, ఎంఈఓ జయరాం నాయు డు జిల్లా స్థాయి విజ్ఞాన ప్రదర్శనను ప్రారంభోత్సవం చేశారు. ప్రిన్సిపాల్ ఎస్తేర మ్మ ఆధ్వర్యంలో జరిగింది. న్యాయ నిర్ణయిత లుగా చంద్రమౌళి, ఫణికుమార్, జయప్రసూన, యానాదిరెడ్డి ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ :గుడ్లూరు మండలం, అడవి రాజుపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీటి ,వీధి దీపాల సమస్య ఉన్నట్లు ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైంది. దీనిపైఅధికారులు స్పందించారు.గురువారం అడవి రాజుపాలెం గ్రామంలో సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఎంపిడిఒ వై వెంకటేశ్వరరావు, స్థానిక సర్పంచి, అసిస్టెంట్ ఇంజనీర్ ఆర్ డబ్ల్యు ఎస్ సాగర్ హౌసింగ్ ఎఈ వెంకటేశ్వర్లు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొని సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు.

ఆధార్ కేంద్రాల్లో పరిశీలన

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ :గుడ్లూరు మండలంలో స్పెషల్ ఆధార్ సేవా కేంద్రాలను ప్రారంభించారు. వీటిని ఎంపిడిఒ వై వెంకటేశ్వర్లు గురువారం మోచర్ల సచివాలయం వద్ద నిర్వహించిన శిబిరాన్ని పరిశీలించారు. శుక్రవారం చేవూరు సచివాలయంలో నిర్వహిం చనున్నారు.ప్రత్యేక ఆధార్ శిబిరాలను చేవూరు పరిసర ప్రాంతాల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-కందుకూరు :టిఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.ఏడుకొండలు నరేంద్ర మాట్లాడారు. భారతదేశానికి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కల్పించాలని కల్పించాలని డిమాండ్ చేశారు. ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ పి రాజగోపాల్, చరిత్ర అధ్యాపకులు డాక్టర్ డి. రామాంజనేయులు మాట్లాడారు. కళాశాల చరిత్ర, రాజనీతి శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన అధ్యాపకులు,(షహనాజ్ బేగం, శ్రీ కే నరేష్ రాజా ఉన్నారు.

నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-కందుకూరు :వాహన చోదకులు ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ లు విధిగా కలిగి ఉండాలని, ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహనతో, వాహనాలను కడు జాగ్రత్తగా నడపాలని కందుకూరు ఇంచార్జి ఎం.వి.ఐ. సిహెచ్. రాంబాబు సూచిం చారు. గురువారం తనను కలిసిన విలేకర్లతో మాట్లాడారు. విద్యాసంస్థల బస్సులు పూర్తిస్థాయిలో ఫిట్‌నెస్ కలిగి ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడపడం మోటార్ వెహికల్ చట్టాన్ని అతిక్రమించినట్లేననితెలిపారు.

పరిహారం చెల్లించి.. టెండర్లను ఆహ్వానించాలి..

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం

ప్రజాశక్తి-నెల్లూరు :భారత్ మాల, సాగర్ మాల జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించి టెండర్లును ఆహ్వానించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం డిమాండ్ చేశాయి. గురువారం ఈ సమస్యపై ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య మాట్లాడుతూ జిల్లాలో భారత్ మాల పేరుతో జాతీయ రహదారి 67, సాగరమాల పేరుతో జాతీయ రహదారి 47 నిర్మాణ పనులు ప్రారంభించేందుకు జిల్లాలో 7 మండలాల్లో అవసరమైన భూమిని ఆయా ప్రాంతాల రైతాంగం నుంచి అధికారులు తీసుకున్నారన్నారు. ఆ భూమిని ఆధారంగా చేసుకొని జీవనం సాగిస్తున్న రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం అందజేయకుండా భూమిని స్వాధీనం చేసుకోవడం దుర్మార్గమన్నారు. నిజానికి ఆయా ప్రాంతాల్లో భూములు బహిరంగ మార్కెట్ విలువ రూ.20 లక్షలు వరకు ఉందన్నారు. ప్రభుత్వం అందజేసిన నామమాత్రపు నష్టపరిహారం మరో రెండు మండలాల్లోని రైతులకు నేటికి వరకు అధికారులు అందజేయలేదన్నారు. దీనిపై భూములు కోల్పోతున్న రైతులు కలెక్టర్‌ను కలిసి తమ సమస్యను వివరించినప్పటికీ స్పందన లేదన్నారు. రైతులకు నష్ట పరిహారం అందజేయ కుండా టెండర్లను ఆహ్వానిం చడం ఎంత మేరకు న్యాయమని ప్రశ్నించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నల గడ్డ వెంకమ్మరాజు మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలకు పెట్టుబడి దారులకు సౌకర్యాల కోసం జాతీయ రహదారులు నిర్మిస్తున్నారని, ఈ జాతీయ రహదారులు పేదలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. 2013 భూ సేకరణ చట్ట ప్రకారంగా నష్టపరిహారం అందజేసి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూ లే వెంగయ్య మాట్లాడుతూ రైతులకు పూర్తి నష్టపరిహారం చెల్లించిన తర్వాతనే టెండర్లు ఆహ్వానించాలని, రైతులకు మెరుగైన నష్ట పరిహారం చెల్లించాలని, అధికారులు ఆ దిశగా ఆలోచనలు చేయాలన్నారు. నారాయణ నగేష్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉద్యోగాలకు 'ప్రకాశం' విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో ఫైనలియర్ విద్యార్థులు కార్పొరేట్ ఉద్యోగాల ఎంపికలో విజయ దుందుభి మోగిస్తున్నారు. గురువారం క్యూ -స్పైడర్స్ కాలేజీ నిర్వహించిన ఇంటర్వ్యూలో 31 మంది ఎంపికైనట్లు టెక్నికల్ డైరెక్టర్ కే.డాక్టర్ కే విజయ్ శ్రీనివాస్ తెలిపారు. కంపెనీ ప్రతినిధులు ప్రతిభా ఉజ్వల్,పి. ఐశ్వరరాయ్‌లు ఎంపిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటర్వ్యూలు పూర్తయిన తర్వాత కరెస్పాండెంట్ కంచర్ల రామయ్య క్యాబిన్‌లో వారు మర్యాద పూర్వకంగా కలిశారు. గతంలో 100 మంది పైగా ప్రకాశ విద్యార్థులు వివిధ కార్పొరేట్ కంపెనీలలో క్యూ -స్పైడర్స్ రోల్స్ లో పనిచేస్తున్నారని, వారి ప్రతిభ తమను ఈ ఏడాది ఇక్కడ ఎంపికలకు వచ్చే పరిస్థితులు కల్పించామన్నారు. ఈ బ్యాచ్ విద్యార్థులు కూడా మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించారని ప్రశంసించారు. ఐబిఎం-అర్‌జె టెక్నాలజీస్ సాఫ్ట్వేర్ కంపెనీ మూడు లక్షల వార్షిక వేతనంతో గతవారం ఐదుగురిని ఎంపిక చేసుకున్నట్లు డాక్టర్ విజయ్ శ్రీనివాస్ వెల్లడించారు. ప్రముఖ అంతర్జాతీయ సంస్థ తమ కాలేజీలో ప్రాంగణ ఎంపికలకు రావడం కాలేజీ విద్యార్థుల నైపుణ్య, సమర్థతకు తార్కాణమని కరస్పాండెంట్ రామయ్య తెలిపారు. హెచ్.సి. ఎల్,విప్రో తదితర కంపెనీలకు సుమారు 100 మంది ఉద్యోగాలకు ఎంపికై ఉన్నారన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ సి. హెచ్.రవికుమార్, ఆర్అండ్‌డి డీన్ డాక్టర్ ఎం. లక్ష్మణరావులు అభినందించారు. సిఎస్ఇ ప్లేస్మెంట్ ఇన్‌చార్జ్ ఎన్ మాధవరావు, కాలేజీ అకడమిక్ ఇన్‌ఛార్జి ఎస్.ఎన్.మీరావాలి పాల్గొన్నారు.



పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి - తోటపల్లిగూడూరు :మండలం మండపంపంచా యతీలో బుధవారం పశు వైద్య శిబిరం జరిగింది. ఎస్ఇఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటె డ్, హీఫర్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా పశు సంవర్ధక శాఖ సహకారంతో ఈ పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో పశువులకు ఆ రోగ్య పరీక్షలు, మందులు, మినరల్ మిక్స్చర్స్, కాల్షియం, లివర్ టానిక్స్, నట్టల మందులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులు, పశుసంవర్ధక శాక అధికారులు డాక్టర్ మురళీకష్ణ, సహాయ సంచాలకులు, ముతుకూరు), పశువు ల డాక్టర్లు ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్ రావు, నరేష్, ఎస్ఇ ఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ అధికారులు, ఆశిష్, హీఫర్ ఇంటర్నేషనల్ అధికారులు గణేష్, పశువై ద్య నిపుణులు పాల్గొన్నారు.



'మెడికవర్'లో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితం

ప్రజాశక్తి-నెల్లూరు :నగరంలోని మెడికవర్ వైద్యశాలలో ప్రపంచ బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన మాసాన్ని పురస్కరించుకోని క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు ఆ వైద్యశాల క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ సెంటర్ హెడ్ డాక్టరు బిందురెడ్డి స్పష్టం తెలిపారు. గురువారం మెడికవర్ వైద్యశాల క్యాన్సర్ ఇన్స్టిట్యూట్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు.ఆమె మీడియాతో మాట్లాడారు. మహిళలకు ఉచిత కన్సల్టేషన్ తోపాటు బ్రెస్ట్ క్యాన్సర్‌కు సంభంధించి రూ. 2,800లు విలువ చేసే మామోగ్రామ్ వంటి స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. మెడికోవర్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ విభాగం ఆంకాలజిస్ట్ రంగరామన్, డాక్టరు శ్రీవిద్య, డాక్టరు రమేష్ బాబు రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టరు పి.జి.ఎస్.ఆర్.ప్రియ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు

ఎఐవైఎఫ్ ధర్నా

నెల్లూరు : కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకొచ్చి రాష్ట్ర వ్యాప్తంగా మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా పెట్టిన మద్యం షాపులను వెంటనే తొలగించాలని ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ఎఐవైఎఫ్ నాయకులు ధర్నా నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా మాట్లాడారు. సిపిఐ నగర్ సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షానవాజ్ మాట్లాడారు. ఎఐవైఎఫ్ నాయకులు గౌస్ బాషా, సర్దార్, బాదుల్లా, అహ్మద్, కరిముల్లా, కలీం, షాజహాన్, సలీం, ఖాన్స, బాబయ్య, సాఫ్జాన్ షబ్బీర్ ఉన్నారు.

జిల్లా విద్యాశాఖాధికారిగా బాలాజీరావు

ప్రజాశక్తి-నెల్లూరు :రాష్ట్రంలో సుమారు 20 జిల్లాల విద్యాశాఖ అధికారులకు స్థాన ఛలనం కలిగిస్తూ విద్యాశాఖ కార్యదర్శి కోనా శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.ఈ క్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న పి.వి.జె.రామారావు బదిలీ చేశారు. డైట్ కళాశాలలో సీనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఆర్.బాలాజీరావును నియమిస్తూ జిల్లా కేంద్రానికి ఉత్తర్వులు జారీ చేశారు.

అభివృద్ధికి కృషి

కందుకూరు : అర్చక పురోహిత సంఘం అభివద్ధికి కషి చేస్తానని నూతనంగా అధ్యక్షులుగా ఎన్నికైన వాకాని శేషాచార్యులు అన్నారు.గురువారం అర్చక పురోహిత సంఘం అధ్యక్ష ఎన్నిక మంచి రాజు మురళి, ఇప్పగుంట వెంకట నాగరాజు అధ్యక్షతన ఏకగ్రీవంగా నిర్వహించారు. అధ్యక్షునిగా వాకాని శేషాచార్యులు, వైస్ ప్రెసిడెంట్ గా సోలా రాజశేఖర్, సెక్రెటరీగా గణపతిరాజు నాగరాజు, జనరల్ సెక్రెటరీగా వాకాని హేమంత్ కుమార్, కోశాధికారిగా పిన్నం రాజు వేణుగోపాల ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు..!

..అర్ధరాత్రి వేళల్లో తిరుగుతున్న టిప్పర్లు -అగ్రహిస్తున్న పలు గ్రామాల ప్రజలు..

ప్రజాశక్తి - తోటపల్లిగూడూరు
యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. అదే విధంగా అర్ధరాత్రి సమయాలలో అక్రమ మట్టి లోడులతో తిరు గుతున్న టిప్పర్లపై పలు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు ఇలా వున్నాయి. గత పది రోజులుగా తోటపల్లిగూడూరు మండలం ఈదూరు ప్రాంతం నుంచి సాలిపేట, నక్కవారిపాలెం, కామాక్షినగర్, కోదండ రామపురం, ఇస్కాపాలెం, కష్ణారెడ్డిపాలెం, పేడూరు, న రుకూరు గ్రామాల మీదుగా నెల్లూరు రూరల్ మండలం మూడో మైలు, సిరిగార్డెన్స్, నెల్లూరు తదితర ప్రాంతాల కు అక్రమ మట్టి లోడుతో టిప్పర్లు తిరుగుతున్నాయి. ఈ వాహనాలు అర్ధరాత్రి సమయాలలో అత్యంత వేగం గా తిరుగుతుం డడంతో సంబంధిత గ్రామాల ప్రజలు తీ వ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కాగా అర్ధరాత్రి వే ళ ప్రజలు గాఢ నిద్రలో వున్న సమయంలో అతివేగంగా తి రుగున్న టిప్పర్ల శబ్దాలకు ఉలిక్కిపడి లేస్తున్నారు. దు మ్ము రేపుకొంటూ టిప్పర్లు తిరుగుతుండడంతో గ్రామస్థు ల కోపం కట్టలు తెంచుకోం టోంది. అసలే అక్రమ మట్టి లోడు, ఆపై అర్ధరాత్రి వేళలో తిరుగుతున్న ఈ వాహనా ల గురించి రెవిన్యూ శాఖ అధికారులు



పట్టించుకోక పో వడం పట్ల ప్రజలు మండి పడుతున్నారు. అంతేకాకుం డా సాక్షాత్తు పోలీసు స్టేషన్ మీదుగా అక్రమంగా తిరుగు తున్న ఈ వాహనాల గురించి పోలీసులు కూడా కనీస విచారణ చేపట్టకపోవడంతో పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. అక్రమార్కుల నుంచి భారీగా ముడు పులు అందుతుండడం వల్లనే అర్ధరాత్రి అక్రమ మట్టి లోడుతో తిరుగుతున్న ఈ వాహనాల గురించి పట్టిం చు కోవడం లేదన్న విమర్శ లు వినిపిస్తున్నాయి. అంతేకాక సౌ త్ ఆములూరు గ్రామానికి చెందిన ఒక టీడీపీ నేత ఈ అక్రమ మట్టి దందాకు పాల్పడుతున్న నేపథ్యంలో చ ర్యలు తీసుకునేందుకు అటు అధి కారులు గానీ, ఇటు పోలీసులు గానీ వెనుకంజ వేస్తున్నారన్న ప్రచారం కూ డా సాగుతోంది. ఈ నేపద్యంలో సంబంధిత శాఖల ఉన్న తాధికారులు జోక్యం చేసుకుని అర్ధరాత్రి వేళ లో అక్రమ మట్టి లోడులతో తిరుగుతున్న టిప్పర్ల విషయంలో చ ర్యలు తీసుకోవాలని సంబంధిత గ్రామాల ప్రజలు కోరు తున్నారు.

50 శాతం సభ్యత్వాలు లక్ష్యంగా పని చేద్దాం

ప్రజాశక్తి-కావలి
కావలి నియోజకవర్గంలోని మొత్తం ఓటర్లలో యాభై శాతం ఓటర్లు తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు తీసుకోవ డమే లక్ష్యంగా అందరం సమిష్టిగా కలసి పని చేద్దామని కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డితెలుగుదేశం పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం కావలి పట్టణంలోని దొడ్లమనోహర్ రెడ్డి - నారాయణ కల్యాణ మండపంలోజరిగిన తెలుగు దేశం పార్టీ సభ్యత్వ నమోదుపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు. ముందుగా తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారకరామారావు విగ్రహానికి పూల మాల వేసి నివాళు లు అర్పించారు.అనంతరం పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపును ఒక అదృష్టంగా భావించి ఆయన సంతృప్తి చెందేలా ప్రతి ఒక్కరమూ సభ్యత్వ నమోదును చేపడుదా మని తెలిపారు. అనుకోనిప్ర మాదం లో వ్యక్తి మరణిస్తే సొంత వారే పట్టించుకోని ఈరోజుల్లో చంద్రబాబు ఇంటి పెద్ద దిక్కుగా తమ పార్టీ కుటుంబ సభ్యులకు అండగా ఉంటున్నారని తెలిపారు. చనిపోయిన వెంటనే మట్టి ఖర్చుల కింద రూ.10 వేలు ఇవ్వడమే కాకుండా, 5 లక్షల ప్రమాద బీమా అందజేయను న్నారని తెలిపారు. కావలికి నేను ఒక సేవకుడిని మాత్రమే అని, ప్రతి కార్యకర్తకు ఎల్ల వేళలా అండగా ఉంటానన్నారు. ప్రతి కార్యకర్త ఆర్థికంగా ఎదగడానికి ప్రయత్నం చేస్తానని, త్వరలోనే కార్యరూపం దాల్చనున్నదని తెలిపారు. ప్రతి నిత్యం పార్టీ శ్రేణులకు ఉదయం 9 నుండి రాత్రి 11 వరకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తూనే ఉన్నానని, ఇలాగే కొనసాగిస్తానని తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుంచి చేపట్టనున్న సభ్యత్వ నమోదు కార్య క్రమంలో ఆయా గ్రామాల నాయకులు ముందుండి ఈకార్యక్రమాన్ని నడిపించా లని తెలిపారు.ప్రతిఒక్కరినీ తెలుగుదేశంపార్టీ కుటుంబ సభ్యులుగా చేర్చుకోవడానికి కృషి చేయాలన్నారు. అధిక సభ్యత్వాలు చేసే వారికి పార్టీలో సముచిత స్థానం కల్పించడం జరుగు తుందన్నారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, విద్యాశాఖ ఐటి మంత్రి నారా లోకేష్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవి చంద్ర సహాయ సహకారాలతో కావలి నియోజకవర్గం అభివృద్ధిపథంలో నడుస్తుం దన్నారు. రానున్న రోజుల్లో పారిశ్రామికంగా అభివృద్ధి చెందబోతున్నదని, పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు కూడా జరగబోతున్నా యని తెలిపారు. సభ్యత్వ నమోదు పై ముందుగా తెలుగుదేశం పార్టీ కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, కావలిరూరల్ మండల అధ్యక్షులు ఆవుల రామకృష్ణ, మాలేపాటి నాగేశ్వరరావు, మాట్లాడారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్ఎ కావ్యకృష్ణారెడ్డి

నీటి సరఫరా చేయాలని వినతి

ప్రజాశక్తి-కావలి: కావలి పట్టణం వైకుంఠపురం 36 వ వార్డు ప్రజలు గురువారం రోజుల నుండి నీటి సరఫరాలేదని,ఇబ్బందులు పడుతున్నామని వెంటనే నీటి సరఫరా చేయాలని గురువారం మున్సిపల్ కార్యాలయానికి వచ్చి,ఆర్ఓ ఇన్‌ఛార్జి కమిషనర్ ఫణి కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైకుంఠపురం పెంకుల ఫ్యాక్టరీ రోడ్డు పక్కన సుమారు 200 కుటుంబాలు పేదలు నివాసం ఉంటున్నా మన్నారు.అందరం నిత్యం కూలి పనులు చేసుకుని జీవి స్తున్నామన్నారు. తమకు వారం రోజుల నుండి నీళ్లు లేనందున పలుఇబ్బందులు పడుతున్నా మన్నారు.ట్యాంకర్ ద్వారా పోసే నీళ్ల పైనే ఆధారపడి ఉన్నా మన్నారు.అది కూడా వారం నుంచి రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నా మన్నారు.తమ ఏరియాలో ఉన్న చేతి బోరు కూడా చెడి పోయి ఉన్నందున నీటి కోసం తహతహలాడుతున్నామన్నారు. తమ గోడు ఎవరు పట్టించు కోవటంలేదని ఆవేదన వెళ్లబుచ్చారు. వీరితోపాటు సిపిఎం నాయకులు పి. పెంచలయ్య, వై.కృష్ణమోహన్ తో పాటు స్థానిక మహిళలు పాల్గొన్నారు.


వినతిపత్రం సమర్పిస్తున్న గ్రామస్తులు

పలుచోట్ల పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి-ఆత్మకూరురూరల్: మండలంలోని అప్పారావు పాలెం, బట్టేపాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సహాయ వ్యవసాయ సంచాలకులు వి. దేవసేనమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్లో అనువైన వరి రకాలు, విత్తన శుద్ధి, నారుమడి పెంపకం వివరాలు, ఎరువుల యాజ మాన్యం పొటాష్ ఎరువులు తప్పనిసరిగా వాడవలసినఅవసరాన్ని తెలియజేశారు. పురుగులు, తెగుళ్లను సరిగ్గా గుర్తించి తదనుగుణంగా సస్యరక్షణ చర్యలు చేపట్టవలసినదిగా తెలియజేశారు. సమగ్ర ఎరువుల పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ-పంట బుకింగ్ 2024 నమోదు ధ్రువీకరణ పత్రాలు రైతులకు ఇవ్వడం జరిగింది. రైతులకు మరియు తదితర ఎరువులను రైతు సేవ కేంద్రాల ద్వారా పంపిణీ చేయవలసిందిగా కోరడమైనది. ఈ కార్యక్రమంలో ఏఏఓ ఎ డి. అర్చన, ఎ యూనిస్ రాణి, రైతులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం.

ప్రజాశక్తి-మర్రిపాడు: మండలంలోని బూదవాడలో ఎన్టీఆర్ మంచి నీటి సుజల స్రవంతి పథకాన్ని ఎంపిడిఒ వైవి నాగేశ్వర ప్రసాద్ గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు రక్షిత మంచినీరు ఇవ్వాలని2014లో అప్పటి సిఎం చంద్రబాబు ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకానికి శ్రీకారం చుట్టారన్నారు.రూ.2లకే 20లీటర్ల మంచి నీటిని అందించాలన్నదే లక్ష్యమన్నారు. తాగునీటికి అవస్థలు పడుతున్న గ్రామస్తులు మంచి నీటి పథకం ప్రారంభం కావడంతో హర్షం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరి సహాయ సహకారాలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గోసి దేవి కృష్ణయ్య, కంభం రమణారెడ్డి, ఆల సురేష్, బేరి ఈశ్వర్ రెడ్డి,దుడ్డి కృష్ణారెడ్డి,శనివారపు ఆంజనేయులు దుద్దుకూరు వెంకటయ్య,మా భాష పాల్గొన్నారు.



విద్యార్థులకు ఇండస్ట్రియల్ విజిటింగ్

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9,10వ తరగతి విద్యార్థులకు ఇండస్ట్రి యల్ విజిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు సిహెచ్ అనంతలక్ష్మి ప్రారంభించారు. ఒకేషనల్ ట్రైనర్ అయినటు వంటి నిత్యశ్రీ ఎజ్రా విద్యార్థిని విద్యార్థులను బ్యూటీ పార్లర్, సెలూన్‌లకు తీసుకొని వెళ్లి అక్కడ ఉన్నటువంటి పేషియల్, బ్లీచింగ్, త్రెడ్డింగ్, మెహందీ,మేకప్ విధానాలు గురించి విద్యార్థులకు మేకప్ ఆర్టిస్ట్ జ్యోతి వివరించారు. విద్యార్థులకు ఉన్నటువంటి ప్రశ్నలకు సమాధానలిస్తూ, ప్రాక్టికల్‌గా విద్యార్థులకు వివరించారు.ఈ ఒకేషనల్ కోర్సు వలన విద్యార్థినీ విద్యార్థులకు సెల్ఫ్ ఎంప్లాయిమెంట్, వారి కాళ్లపై వారు స్వశక్తిగా నిలబడేందుకు వారు జీవితంలో ముందుకు సాగడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వత్తి విద్యా ఉపాధ్యాయులు ఎజ్రా, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయిని లక్ష్మి కుమారి, బాలికలు పాల్గొన్నారు.



నాడు-నేడు పనుల్లో అవినీతి

ప్రజాశక్తి-నెల్లూరు: నాడు-నేడు పనుల్లో పెద్ద అవినీతి జరిగిందని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి ఆరోపించారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 2019 - 2024 మధ్య వైసిపి ప్రభుత్వం నాడు నేడు పేరుతో పాఠశాలల ఆధునీకరణ చేపట్టింది .ఈ పథకం కింద అద్భుతాలు జరిగాయని నాటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గొప్పలు చెప్పుకున్నారన్నారు. ఈ పథకం కింద అద్భుతాలు జరగలేదు కానీ,అద్భుతమైన అవినీతి జరిగిందన్నారు. వాస్తవానికి ఈ పథకంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని తెలిపారు.పాత వాటికే రంగులు వేసి,కొత్తవి కట్టనట్లు బిల్లులు చేసుకున్నారని తెలిపారు.. స్థానికంగా తక్కువ ధరకే దొరికే మెటీరియల్ ను కూడా సెంట్రల్ పోక్యుర్మెంట్ పేరుతో నాసిరకం మెటీరియల్ ను ఎక్కువ ధరకు సరఫరా చేశారన్నారు. ద్యార్థులు భవిష్యత్తు ను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం రూ.2560 కోట్లు గ్రాంట్ గా ఇచ్చిందన్నారు.సర్వశిక్షా అభియాన్ పథకం కింద రూ.1000 కోట్లు గ్రాంటుగా ఇచ్చిందన్నారు.. వరల్డ్ బ్యాంక్ రూ.700 కోట్లు, నాబార్డు రూ.1800 కోట్లు మొత్తం కలిపి 6 వేల కోట్ల పైగా నిధులు వచ్చాయన్నారు. ఈ నిధులను కూడా నాటి ప్రభుత్వం సక్రమంగా వినియోగించలేదన్నారు .దీనిలో రూ.1805 కోట్లు దుర్వినియోగం జరిగినట్లు కేంద్రం తేల్చిందన్నారు. ఇంకా పనులు చేసిన వారికి,మెటీరియల్ సరఫరా చేసిన వారికి దాదాపు రూ.2400 కోట్లు బకాయిలు ఉన్నాయని తెలిపారు. వైసిపి పాలనలో జరిగిన నాడు - నేడు పనులు పై సమగ్ర విచారణ జరిపి,ఈ పథకంలో జరిగిన అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చి బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న చేజర్ల

చక్కని దస్తూరిపై అభినందనలు

ప్రజాశక్తి-ఉదయగిరి: ఉర్దూ పాఠశాలైన మాతృభాషలో విద్యార్థుల దస్తూరి చాలా చక్కగా ఉందని మండల విద్యాశాఖ అధికారి షేక్ మస్తాన్‌వలి అభినందించారు. గురువారం మండల పరిషత్ ప్రాథమిక ఉర్దూ పాఠశాల షబ్బీర్ కాలనీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి విద్యార్థుల పఠన అభ్యసన సామర్ధ్య నైపుణ్యాలను పరిశీలిస్తూ మాతృభాష తెలుగు ఆంగ్లంలో విద్యార్థుల దస్తూరి చేతి రాత పరిశీలించారు. ఉర్దూ పాఠశాలైన తెలుగు ఆంగ్లం లో విద్యార్థుల దస్తూరి చాలా చక్కగా ఉండటంతో విద్యార్థులను ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థుల సామర్థ్యాలు వారి తరగతి స్థాయి కంటే ఎక్కువగా ఉన్నవని పాఠశాల సమయం మధ్యాహ్నం 3:30 కి ముగుస్తున్నప్పటికీ 4.30 వరకు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న ప్రధానోపా ధ్యాయులు లియాఖత్ అలీని, ఉపాధ్యాయులు మున్నాని అభినందించారు. 5వ తరగతి విద్యార్థులకు ఏదైనా విషయంపై ప్రతి నెలా ఒకసారైనా సెమినార్స్ నిర్వహించవలెనని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద నుంచి ఆధార్ సమాచారం తెప్పించుకొని అపార్ ఐడి జనరేషన్స్ వీలైనంత త్వరగా పూర్తి చేయలని తెలిపారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఎంఇఒ

రోడ్డు ప్రమాదంలో ఆర్ఎస్ఆర్.విద్యార్థి దుర్మరణం

ప్రజాశక్తి-కావలి.: కావలి గౌరవరం జాతీయ రహదారి వద్ద మోటార్ సైకిల్ పై ప్రయాణిస్తున్న ఆర్ఎస్ఆర్ ఇంజినీరింగ్ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు.ఈసంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు..ఆర్ఎస్ఆర్ విద్యార్థి నాలుగో సంవత్సరం చదువుతున్న ధనియాలు విజయ్ కుమార్(23) గౌరవరం నుంచి బిట్రగుంట కు వెళ్తుండగా మోటార్ సైకిల్ పైనుంచి జారిపడ్డాడు. మరో విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి . అతనికికావలివైద్యశాలలో చికిత్స నిర్వహిస్తున్నారు. కావలి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రక్తదానం అభినందనీయం

ప్రజాశక్తి-కావలి: విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరులకు నివాళిగా రక్తదానం చేయడం అభినందనీయమని కావలి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం కావలి డిఎస్‌పి కార్యాలయ ప్రాంగణంలో పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కావలి 1,2వ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు ఎండి ఫిరోజ్, కె శ్రీనివాసులు, రాజేశ్వర రావు, పాపారావుల ఆధ్వర్యంలో పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు, ఆటోకార్మికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సహా ఎస్ఐలు, కానిస్టేబుళ్లు 150 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి రక్తదాతలను పేరు పేరునా అభినందించి, వారికి పండ్లు, జ్యూస్‌లను అందజేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ, తక్కువ సమయంలో సమాచారమిచ్చినా ఇంతమంది రక్తదానానికి ముందుకు రావడం ఆశ్చర్యం కలిగించిందనిపేర్కొన్నారు.పోలీసులకు సంఘీభావం తెలిపిన వారందరిని అభినందనలు తెలిపారు. రెడ్ క్రాస్ ప్రభుత్వ ఆసుపత్రి రక్తకేంద్రాల నిర్వాహకులు డాక్టర్.బెజవాడరవికుమార్, డాక్టర్ స్వరూపరాణిల పర్యవేక్షణలో రక్తాన్ని సేకరించారు. రెడ్ క్రాస్ ప్రతినిధులు డి రవిప్రకాష్, కె.హరినారపరెడ్డి, ఓరుగంటి వెంకటేశ్వర్లు, రొటేరియన్లు నల్లూరి రవికుమార్, చంద్రశేఖర్, వి సేవా ఫౌండేషన్ వినయ్ కుమార్, రహీమ్ చారిటబుల్ ట్రస్ట్ మహ్మద్ అబ్దుల్ హలీం, ప్రియదర్శిని మహిళా మండలి ఖాదర్‌బీ, గుడ్ మాన్ ట్రస్ట్ సోమిశెట్టి బ్రహ్మయ్య పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న దృశ్యం

టీడీపీ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-ఆత్మకూర్ అర్బన్: రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో రాష్ట్ర టీడీపీ మహిళా అధ్యక్షురాలు పులిమి శైలజారెడ్డి ఆధ్వర్యంలో ముమ్మరంగా నిర్వహిం చారు. టీడీపీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేపడు తున్న సంక్షేమ కార్యక్రమాలను వారికి వివరిస్తూ సభ్యత్వ నమోదును చేపట్టారు. ప్రజా సంక్షేమ పాలనకు శ్రీకారం చుడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, ప్రజలకు అవసరమైన అన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని టిడిపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పులిమీ శైలజా రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును స్వీకరించి పార్టీని మరింత బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


సభ్యత్వం తీసుకున్న మహిళలు

నేషనల్ హైవే పరిశీలన

ప్రజాశక్తి-కలిగిరి/వింజమూరు: ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్ , నేషనల్ హైవే అధికారులు, మండల రెవెన్యూ అధికారులతో సంయుక్తంగా కలసి దుత్తలూరు నుండి కలిగిరి జలదంకి వరకు నేషనల్ హైవే డ్రెయిన్లు హైవే రోడ్డు పనుల ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ప్రజల వద్ద నుండి సమస్యలను స్వీకరించి, వారికి తగిన న్యాయం చేస్తారని తెలిపారు. అంతేకాకుండా రోడ్డు విస్తరణలో భాగంగా ఇల్లు, స్థలములు కోల్పోయిన బాధితులకు పరిహారం వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అనివార్య కారణాల వలన రాకపోతే సమస్యను పరిశీలించి, పరిహారం ఇప్పించేం దుకు కృషి చేస్తానని అన్నారు. నేషనల్ హైవే పనులను త్వరితిగతిన పూర్తి చేసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో దుత్తలూరు, వింజమూరు, కలిగిరి జలదంకి తెలుగుదేశం పార్టీ, జనసేన, కార్యకర్తలు, అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ప్రతి సభ్యురాలూ ఆర్థికంగా ఎదగాలి

ప్రజాశక్తి-కోవూరు
పొదుపు సభ్యులుగా ఉన్న ప్రతిఒక్కరూ ఎదగాలని ఎంపిడిఒ చిలకల శ్రీహరి రెడ్డి కోరారు. కోవూరు సంఘమిత్ర 19వ సర్వసభ్య సమావేశం గురువారం కోవూరు సంఘ మిత్ర కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి హాజరై అయన మాట్లాడారు. సభ్యులు తీసుకున్న వివిధ రుణాలను సకాలంలో తిరిగి చెల్లించి మరోసారి ఎక్కువ మొత్తంలో రుణం .పొందాలన్నారు .తద్వారా ఆ కుటుంబఆర్థికంగా ఎదుగుతుందన్నారు ఈ సమావేశంలో సుబ్బరాజు, టిడిపి మండల అధ్యక్షులు ఇంతా మల్లారెడ్డి, జనసేన నాయకులు శ్రీనివాసులు రెడ్డి, సిసిలు, సంఘమిత్ర సభ్యులు పాల్గొన్నారు.

ఎనిమిది టిప్పర్లు స్వాధీనం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం: రాత్రి వేళల్లో ఎలాంటి అనుమతుల్లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఎనిమిది టిప్పర్లను బుచ్చిరెడ్డిపాలెం సిఐ శ్రీనివాసులు రెడ్డి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు రూరల్ పరిధిలోని పొట్టే పాలెం ఇసుక రీచ్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఎనిమిది టిప్పర్లు బుధవారం అర్ధరాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నాయని తెలిపారు. వీటిని బుచ్చిరెడ్డిపాలెం లో స్వాధీనం చేసుకొని స్టేషన్ కు తరలిం చామ న్నారు. అనంతరం మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. ఈ టిప్పర్లు స్థానికులు, స్థానికేతర్లు ఉండటం విశేషం.

నల్లపరెడ్డి ప్రసన్నను కలిసిన వీరి చలపతిరావు

ప్రజాశక్తి-కొడవలూరు : మాజీ మంత్రివర్యులు మాజీ శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డిని మర్యాదపూ ర్వకంగా మాజీ డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు గురువారం కలిశారు. ఆయనకు రాష్ట్ర వైసీపీ అధికార ప్రతినిధి పదవి దక్కడంతో వీరి చలపతి రావు కృతజ్ఞతలు తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి-ఉదయగిరి: ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని 34 చెరువులకు సంబంధించిన సాగునీటి సంఘాలకు ఎన్నికలకు రైతు వివరాలతో సర్వం సిద్ధం చేశామని ఇరిగేషన్ డిఇఇ చంద్రమౌళి పేర్కొ న్నారు. మండలంలో 11, సీతారాం పురం మండలంలో 06, గండిపాలెం ప్రాజెక్టు కింద 17 చెరువులున్నా యన్నారు. ఇప్పటికే ఆయా చెరువుల పరిధిలోని ఆయకట్టు రైతుల 1- బి అడంగళ్ లను తహశీల్దార్ కార్యాలయంలో అందజేశామ న్నారు. నంబర్ 1, 2 తేదీల్లో రైతుల ఓట్లపై అభ్యంతరాల స్వీకరణ, 3న పరిష్కారం పరిష్కారం జరుగుతుందని 19, 20, 21వ తేదీల్లో ఎన్నికలు జరుగునని తెలిపారు.

గణిత సామర్థ్యాల పరిశీలన

ప్రజాశక్తి-ఉదయగిరి: పదవ తరగతి విద్యార్థుల గణిత సామర్థ్యాలను మండల విద్యాశాఖ అధికారి తోట శ్రీనివాసులు పరిశీలించారు. గురువారం మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అప్పసముద్రం పాఠశాలను ఆయన తనిఖీ చేసి పదవ తరగతి విద్యార్థులకు గణిత విషయం లో మెలకువలను నేర్పించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న మనబడి మన భవిష్యత్తు పనులను, డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనం, పాఠశాల లోని అన్ని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు విజయ్ కుమార్ , ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత

ప్రజాశక్తి-కోవూరు : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ప్రముఖ పారిశ్రామికవేత్త ఎం వెంకటేశ్వరరావు చేయూత నిచ్చారు. కోవూరు అరుంధతి ఎయిడెడ్ పాఠశాల ను దత్తత తీసుకొని గత 20ఏళ్లుగా అక్కడ చదువుతున్న పేద విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందిస్తామని తెలిపారు. అందులో భాగంగానే గురువారం చిన్నారులకు బుక్స్ పంపిణీ చేశారు

ఖాళీ స్థలాన్ని కమ్యూనిటీ హాల్‌కు కేటాయించండి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం: స్థానిక బాలకృష్ణ గిరిజన కాలనీలోని ఖాళీగా ఉన్న స్థలాన్ని కమ్యూనిటీ హాల్ కు కేటాయించాలని నగర పంచాయతీ కమిషనర్‌కు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు.పట్టణంలోని 4వ వార్డు పరిధిలో బాలకృష్ణ నగర్ గిరిజన కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వెనకవైపు ఉన్న ఖాళీ స్థలాన్ని అంబేద్కర్ నగర్ వాసులకు, బాలకృష్ణ గిరిజన కాలనీ వాసులకు ఉపయోగ పడేలా కమ్యూనిటీ హాల్ కు కేటాయించాలని ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ బట్రా విల్సన్ తో పాటు పలువురు ఆ ప్రాంతవాసులు బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ కమిషనర్ కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ గిరిజన కాలనీలో కమ్యూనిటీ హాల్ లేకుండా ఇబ్బంది పడుతున్నారని ఆయనతోపాటు దయాకర్, సుబ్బారావు, శ్రీనివాసులు, శివ, పవన్ పలువురు పాల్గొన్నారు.

అయోడిన్ ఉప్పు పై అవగాహన

ప్రజాశక్తి-అనంతసాగరం: మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో అయోడిన్ ఉప్పు గురించి సూపర్‌వైజర్ ఎం శారదమ్మ గురువారం అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయోడిన్ ఉప్పు వాడడం వలన గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు ఆరోగ్యానికి ఎంతో మంచిదని పేర్కొన్నారు ఈ అయోడిన్ ఉప్పు వలన అనేక జబ్బులు రాకుండా ఉంటుందని తెలిపారు.

ఇంకుడు గుంతలు నిర్మించాలి


ప్రజాశక్తి-ఉదయగిరి: మండల పరిధిలోని 17 పంచాయతీల్లో పంచాయతీకి రెండు చొప్పున 34 ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని ఉపాధి హామీ సిబ్బందికి ఎంపీడీఓ అప్పాజీ తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉపాధి హామీ సిబ్బంది సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ పడిన వర్షపు నీరు వడిసి పట్టే తొట్టెలు నిర్మాణంతో పాటు, రైతు వారి కుంటలు హౌసింగ్, హార్టికల్చర్, నర్సరీలు పనులను వేగవంతం చేయాలన్నారు. చేపట్టే పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపీఓ శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.

గోపాల్‌రెడ్డి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-కోవూరు
మండలం లోని లేగుంటపాడు గ్రామానికి చెందిన రైతు సంఘం నాయకులు, వైసిపి నాయకులు కీర్తిశేషులు గునపాటి తులసిరెడ్డి తండ్రి గునపాటి గోపాల్ రెడ్డి ఇటీవల మృతిచెందారు. ఆయన కుటుంబ సభ్యులను గురువారం మాజీ మంత్రివర్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి వారు స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులైన గునపాటి ప్రసాద్ రెడ్డి, గునపాటి దయాకర్ రెడ్డి, గునపాటి మిత్రా రెడ్డిలను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎఎంసి చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, తదితరులున్నారు.

నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి:
మండల పరిధిలోని స్వయం సహాయక సంఘాలు వారికి ఇచ్చిన నెలవారి లక్ష్యాలను సాధించాలని ఏపీఎం షేక్ ఖాజా రహమతుల్లా పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో ఈసీ మెంబర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోజువారి జరిగే రికవరీలో మొబైల్ కీపింగ్, ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ కార్యక్ర మాలను ప్రజల్లోకి మరింత చేరువగా తీసుకుపోయేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ వారికి ఇచ్చిన టార్గెట్ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసుకోవాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది, సిసిలు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

గ్రంథాలయంలో తనిఖీ

ప్రజాశక్తి-కొడవలూరు: గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజా గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులన్నీ సక్రమంగా ఉండడంతో కొడవలూరు గ్రంథాలయ అధికారి రాజేశ్వరి ఆయన అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, పాల్గొన్నారు.

నాడీ వ్యవస్థ అభివృద్ధికి అయోడిన్ కీలకం

ప్రజాశక్తి-కావలి: అయోడిన్ ఉప్పు తీసుకో వడం వలన థైరాయిడ్ బారిన పడకుండా ఇది దోహదపడు తుందని "ది పూర్ పీపుల్స్ వాలంటరీ ఆర్గనైజేషన్" అధ్యక్షులు చేవూరుచిన్న అన్నారు. కావలి పట్టణంలోని 5వ వార్డు గిరిజనకాలనీలో అంగన్వాడి కేంద్రంలో ప్రజా ప్రగతి ట్రస్ట్ తిరుపతి, న్యూట్రిషన్ ఇండియా గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ సహకారంతో ది పూర్ పీపుల్స్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షులు చేవూరు చిన్న ఆధ్వర్యంలో ప్రపంచ అయోడిన్ లోపం దినోత్సవం కార్యక్రమం నిర్వహిం చారు. ఈకార్యక్రమ ంలో అయోడిన్ వి నియోగం ప్రాముఖ్యత, ఆరోగ్యంపై దాని ప్రభావం గురించి అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.కృపమ్మ పాల్గొన్నారు.

పాఠశాలలో ఎంఇఒ తనిఖీ

ప్రజాశక్తి-కావలి: పట్టణంలోని డాక్టర్ లక్ష్మీ కృష్ణారావు విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఇఒ1 బండి గోవింద య్య, ఎంఇఒ2 సిహెచ్ వెంకటసుబ్బయ్య మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాలకు విచ్చేశారు. ప్రధానోపాధ్యాయులు మధ్యాహ్న భోజనం చేయు విద్యార్థుల సంఖ్యను ఆన్లైన్ లో 181 మందిగా నమోదు గమనించి, వరుస క్రమంలో నిలబెట్టి లెక్కించి 181 మంది విద్యార్థులు మధ్యాహ్నభోజనం చేయడం గుర్తించి, వారికి మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు.భోజనం రుచికర ంగా ఉందని సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్ర మంలో పాఠశాల ప్రధా నోపాధ్యాయులు ఎన్.డి.చౌదరి ఉపాధ్యాయులు కుమారి జి.కళ్యాణి, సిహెచ్. బ్రహ్మయ్య, షేక్.షరీఫ్ పాల్గొన్నారు.

ప్రసన్నను కలిసిన విల్సన్

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన మాజీ మంత్రివర్యులు ప్రసన్న కుమార్ రెడ్డిని ఆయన నివాసంలో బుచ్చిరెడ్డిపాలెం నగర యువజన విభాగం అధ్యక్షులు బట్టా విల్సన్ ఆయన సతీమణి జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు ప్రవళిక గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

25నుంచి పశుగణన

ప్రజాశక్తి -వరికుంటపాడు : ఈ నెల 25 తేదీ నుంచి జాతీయ పశుగణన కార్యక్రమం జరుగుతుందని పెద్దిరెడ్డి పల్లె పశుసంవర్ధక శాఖ డాక్టర్ రాఘవేంద్ర శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పశు సంవర్ధక శాఖ సిబ్బంది అన్ని గ్రామాలలోని ప్రతి ఇంటికి వెళ్లి పశువులను, కుక్కలను, కోళ్లవంటి వాటిని వేర్వేరుగా నమోదు చేస్తారని తెలిపారు. పాడి రైతులంతా పశుసంవర్ధక శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

మానేగుంటపాడులో గ్రామసభలు

ప్రజాశక్తి కొడవలూరు : గ్రామ సభల ద్వారా రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నామని తహశీల్దార్ కె స్ఫూర్తి రెడ్డి అన్నారు. ఆమె గురువారం మానేగుంటపాడు గ్రామంలో రీ సర్వే కు సంబంధించిన గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో రైతులు రెవెన్యూ సమస్యలపై ఇబ్బందులు పడుతు న్నారని అలాంటి సమస్యలపై ఈ గ్రామ సభ ద్వారా పరిష్కరించడం జరుగుతుం దన్నారు. రైతుకు సంబంధించిన వన్ బి అడంగల్‌లో తప్పులుంటే వాటిని రైతు ఈ సభల ద్వారా తెలియజేస్తే తప్పులను సవరించడం జరుగుతుం దన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి, రీ సర్వే డిటి, ఆర్ఐ, విఆర్ఒ, రైతులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE 7 th ADDITIONAL DISTRICT SESSIONS JUDGE GUDUR
Crl M.P.No.144/2023 in C.R.L.P.R.No.1 of 2020
1. Kodavaluru Prasad (Died) & 2 Others ....Petitioners/Complients
VS
1. Panubali Ravi Kumar ...Respondents/Accused
NOTICE
To,
Panubali Ravi kumar, S/o Sudhakarnaidu, Hindu, aged about 44 years, Business, Kalayakagalu Village, Buchi Mandal, SPSR Nellore Dt.
పై తెలిపిన Cr/M.P.No.144/2023 in C.R.L.P.R.No.1 of 2020 లో పిటిషనరు, Kodavaluru Prasad చనిపోయినారు. కావున పిటీషన్ దాఖలు చేసియున్నాడు. అందులో ప్రతివాది మరియు ముద్దాయి కాబట్టి నీకు నోటీసు నిమిత్తం పై కోర్టు వారు తేది: 07-11-2024, 10.30 గంllలకు పై కోర్టు అందు హాజరు కావలెను. ఆక్షేపణలు ఉన్నయెడల స్వయంగా కానీ, లేక మీ తరపున వకీలు కాని పైకోర్టు నందు తేది.07-11-2024 10.30 గంllలకు హాజరు కావలెను. లేనియెడల పై కోర్టు వారు మీ పై పరోక్షంగా తీర్మానించబడును.
కొండూరు హరిప్రసాద్, బి.ఎ., బి.ఎల్.,
సెల్:9705054118
పిటీషనరు తరపు న్యాయవాది,
గూడూరు, తిరుపతి జిల్లా.

CHANGE OF NAME
I, GUMPERLA GEETHAMMA (Old Name), Resident of D.No.1-2-149/24, F.C.I. Colony, Nazzer Thota, Nawabpet,Nellore-524002,SPSR Nellore Dt, AP.Here by declare that I have changed my name as
THUMMAPUDI SYAMALA GEETHA
(New Name)
W/o THUMMAPUDI VENKATA SUBRAHMANYAM